



ఐక్య విప్లవ శంఖారావం


ముస్తాబైన ఎన్నీ కార్యాలయం

- చేతులు కలిపిన మూడు విప్లవ సంస్థలు
- ఖమ్మం వేదికగా నేడు జాతీయ పార్టీగా ఆవిర్భావం
- నేటి నుంచి 'మాస్‌లైన్' జాతీయ మహాసభలు
- సాయంత్రం కార్మిక, రైతు సంఘాలతో భారీ ర్యాలీ, బహిరంగసభ
- హాజరుకానున్న నేపాల్, శ్రీలంక, జర్మనీ ప్రతినిధులు


తోరణాలతో అలంకరించిన కూడలి

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 2: 'దున్నేవాడికే భూమి.. ప్రజలకే రాజ్యాధికారం' లక్ష్యంగా బందూక్ చేత పట్టి ఉద్యమాలు సాగించిన విప్లవ పార్టీలు బందూక్‌తో సాధించలేనిది ప్రజాబలంతో సాధించాలనే లక్ష్యంతో ఐక్యత దిశగా అడుగులు వేస్తున్నాయి. అజ్ఞాతమా, ప్రజా పోరాటమా అనే విషయంపై 40ఏళ్ల చర్చోపచర్చల తరువాత చివరికి సమాజంలో నిలబడే కలబడాలని నిర్ణయించాయి. ఈ క్రమంలో జాతీయ స్థాయిలో ఐక్య పోరాటాలు సాగించేందుకు దేశంలోని మూడు విప్లవ పార్టీలు 'మాస్‌లైన్' పేరుతో ఒకే పార్టీగా ఏకం కానున్నాయి. ఇందుకు విప్లవాల పురిటి గడ్డ ఖమ్మం వేదిక కానుంది. తెలంగాణలోని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా, అస్సాం, త్రిపుర, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ బీహార్ రాష్ట్రాల్లో పనిచేస్తున్న పీసీసీ సీపీఐ(ఎంఎల్), అలాగే 12రాష్ట్రాల్లో కార్మిక, రైతు, ఉద్యమాలు చేస్తున్న సీపీఐ(ఎంఎల్) రెవెల్యూషనరీ ఇన్షియేటివ్ పార్టీలు కలిసి మాస్‌లైన్ జాతీయ పార్టీగా ఆవిర్భవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలో ఆదివారం నుంచి మూడురోజులపాటు మాస్‌లైన్ జాతీయ మహాసభలు నిర్వహించనున్నారు.

ప్రజాపంథా నుంచి మాస్‌లైన్ దిశగా

నాలుగు సిద్ధాంతాలపై విభేదించి సీపీఐ (ఎంఎల్)న్యూడెమొక్రసీ నుంచి వేరుపడి పోటు రంగారావు నాయకత్వంలో 2022 ఫిబ్రవరి 22న ప్రజాపంథా పార్టీ ఆవిర్భవించింది. ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శిగా రంగారావు ఎన్నికయ్యారు. తరువాత ఆ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలు, ప్రజా సంఘాల నిర్మాణం చేశారు. ప్రజాపంథా భావస్వారూప్యంతో మరో రెండు విప్లవ పార్టీలు ముందుకు రావటంతో ఐక్య కార్యచరణ చేశారు. ప్రజాసంఘాల అమోదం మేరకు ఖమ్మంలో జాతీయ మహాసభలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు.

ఖమ్మం వేదికగా విప్లవ శంఖం

మూడు విప్లవ పార్టీలు 'మాస్‌లైన్' జాతీయ పార్టీగా ఆవిర్భావించే వేదికగా ఖమ్మం గుమ్మం నిలవనుంది. ఆదివారం నుంచి మూడురోజుల పాటు ఖమ్మంలో 'మాస్‌లైన్' జాతీయమహాసభలు జరగనున్నాయి. ఆదివారం సాయంత్రం నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీ నుంచి పెవిలియన్ మైదానం వరకు వేలాది మందితో ర్యాలీ, గ్రేట్‌మార్చ్ నిర్వహిస్తారు. అనంతరం అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తారు. 4, 5 తేదీల్లో భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల మహాసభలు నిర్వహిస్తారు. ఈ ప్రతినిధుల సభల్లోనే కేంద్ర కమిటీ ఎన్నిక, ఇతర రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు.

విదేశీ ప్రతినిధుల రాక

మాస్‌లైన్ ఆవిర్భావ మహాసభలకు జర్మనీ ఎం.ఎల్. డీపీడీ పార్టీ ప్రతినిధులు, నేపాల్ సీపీఐ(ఎంఎల్) ముసాల్ ప్రతినిధి, శ్రీలంక పార్టీ ప్రతినిధి సౌహార్ద హాజరు కానున్నారు. వీరితో పాటుగా దేశంలోని ఎంఎల్ పార్టీల ప్రతినిధులు హాజరుకానున్నారు. 12రాష్ట్రాల నుంచి రైతు, కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు ఈ మహాసభలకు హాజరు కానున్నారు. కాగా, మాస్‌లైన్ ఆవిర్భావ సభల సందర్భంగా ఖమ్మం నగరాన్ని అరుణ తోరణాలతో అలంకరించారు. పలు కూడళ్లలో బ్యానర్లు ఏర్పాటు చేశారు.

'మాస్‌లైన్'తో సంఘటిత పోరాటాలు

- మతోన్మాద విధానాలను అడ్డుకోవడమే లక్ష్యం
- 'ఆంధ్రజ్యోతి'తో జాతీయ నేతలు ప్రదీప్‌సింగ్ ఠాగూర్, సుభాష్‌దేవ్, కేజీ రాంచందర్


మాట్లాడుతున్న కేజీ రాంచందర్, ప్రదీప్‌సింగ్‌ఠాగూర్, సుభాష్ దేవ్

ఖమ్మం, మార్చి2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) మహాసభల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలను సంఘటితం చేసి పోరాటాలకు శ్రీకారం చుట్టబోతున్నామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) ముఖ్య నేతలు ప్రదీప్‌సింగ్ ఠాగూర్, సుభాష్‌దేవ్, కేజీ రాంచందర్ పేర్కొన్నారు. మాస్‌లైన్ మహాసభల్లో పాల్గొనేందుకు ఖమ్మం వచ్చిన వారు శనివారం ప్రజాపంథా కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సీపీఐ ఎంఎల్ ఆర్ఐ జాతీయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌తో పాటు తమ పార్టీ 12రాష్ట్రాల్లో ప్రజాపోరాటాలు సాగిస్తూ రైతాంగ, కార్మిక సమస్యలపై పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం 'మాస్‌లైన్' పార్టీలో విలీనమై ఒకే వేదికగా ఉద్యమాలు చేయాలని నిర్ణయించామన్నారు. దేశంలో ప్రస్తుతం బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతన్మోద విధానాలు పెరగిపోయాయని, వాటిని అడ్డుకోవడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. అంతర్జాతీయ సమస్యలపై కూడా ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు. పీసీసీ సీపీఐఎంఎల్ జాతీయ కార్యదర్శి సుభాష్‌దేవ్ మాట్లాడుతూ ఇప్పటివరకు తమ పార్టీ త్రిపుర, అస్సాం తదితర రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలు, ఆందోళనలు సాగించిందని, ఇప్పుడు 'మాస్‌లైన్' పార్టీలో విలీనంతో ఉమ్మడి అజెండాతో పనిచేయబోతున్నామన్నారు. దేశంలో ఆర్థిక, అసమానతలు పెరిగిపోయాయన్నారు. వ్యవసాయ, కార్మిక రంగాలు సంక్షోభంలో ఉన్నాయన్నారు. ఖమ్మం సభల ద్వారా పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా సామాన్య ప్రజల కనీస అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ప్రజాపోరాటాలకు కార్యచరణ చేస్తామన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) జాతీయ కార్యవర్గసభ్యుడు కేజీ రాంచందర్ మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే మాస్‌లైన్ యూనిటీ మహాసభల్లో భవిష్యత్తులో దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన ప్రజాపోరాటాలకు కార్యచరణ సిద్ధం చేస్తామన్నారు.


కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగేలా

తీర్పులుండాలి

- కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి
- హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్
- దమ్మపేటలో జూనియర్ సివిల్ కం జూడీషియల్ కోర్టు ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు బీమపాక నగేష్, కె.శరత్

దమ్మపేట, మార్చి 2: న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా కోర్టు తీర్పులుండాలని హైకోర్టు న్యాయమూర్తి (భద్రాద్రి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి)ఈవీ వేణుగోపాల్ తెలిపారు. కోర్టుల్లో కేసులు సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. భద్రాద్రి జిల్లా దమ్మపేటలో జూనియర్ సివిల్ జడ్జ్ కం జ్యుడీషియల్ మ్యాజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టును శనివారం హైకోర్టు న్యాయమూర్తులు బీమపాక నగేష్, కె.శరత్‌తో కలిసి న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో న్యాయమూర్తి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలు న్యాయం కోసం చివరగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తారని, వారికి న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగేలా తీర్పులు ఉండాలన్నారు. న్యాయవ్యవస్థ సమయం చాలా విలువైనదని, సమయాన్ని వృథా చేసే కేసులు కోర్టులకు రాకుండా చూడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు.

దమ్మపేటలో కోర్టు ఏర్పాటుకు ప్రస్తుతం హైకోర్టు న్యాయమూర్తులుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు బీమపాక నగేష్, శరత్, కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వసంతపాటిల్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, సత్తుపల్లి పూర్వ బార్ అధ్యక్షుడు, లాయర్ రాజేంద్రప్రసాద్ కృషి ఉందని ప్రశంసించారు.

కార్యక్రమంలో న్యాయమూర్తులు బీమపాక నగేష్, కె. శరత్ మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలు తమకు తెలిసినందువల్లనే దమ్మపేట ప్రాంతంలో కోర్టు ఆవశ్యక తమ దృష్టికి రావటంతో కోర్టు ఏర్పాటుకు తమవంతుగా సహకరించామన్నారు. వేదమంత్రాల నడుమ దమ్మపేట కోర్టును న్యాయమూర్తి వేణుగోపాల్ ప్రారంభించగా ప్రధాన న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రామారావు కక్షిదారులతో కోర్టు నిర్వహించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి బీమపాక నగేష్ మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాతో తనకున్న అనుబంధంతో ఈ జిల్లాలో తన సొంత ఖర్చులతో 20ఎకరాల భూమిని సేకరించి అడవులు పెంచాలనేదే తన ఆశయంగా తెలిపారు. త్వరలోనే ఆ కార్యక్రమాన్ని చేపతానని తెలిపారు. అన్తరం హైకోర్టు న్యాయమూర్తులను, భద్రాద్రి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వసంతపాటిల్‌ను న్యాయవాదులు, అధికారులు, సత్తుపల్లి బార్ అసోసియోషన్ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.


కొత్తగూడెంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష

నిండు జీవితానికి రెండు చుక్కలు

- పల్స్‌పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం
- ఖమ్మం జిల్లాలో 1,30,747మంది..
- భద్రాద్రి జిల్లాలో 98,358 మంది చిన్నారుల గుర్తింపు
- నేడు ఖమ్మంలో ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, మార్చి 1: చిన్నారులు పోలియో మహమ్మారి బారిన పడకుండా ప్రభుత్వం చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్యఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. ఇరు జిల్లాల్లో అప్పుడే పుట్టిన శిశువు నుంచి అయిదేళ్లలోపు చిన్నారుల వరకు పోలియోచుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, కమ్యునిటీ హెల్త్‌సెంటర్లు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటితో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్‌తో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ పోలియో చుక్కలు వేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఖమ్మం జిల్లాలో మొత్తం 1,30,747మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 950 పోలియోబూత్‌లు, రైల్వే, బస్‌స్టేన్ల వద్ద30 బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు 30 మొబైల్ బృందాలు, 3,800 మంది సిబ్బంది, 95మంది సూపర్‌వైజర్లతో పల్స్‌పోలియోకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నిర్ణీత కేంద్రాల్లో చుక్కలు వేయనుండగా 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి మిగిలిన పిల్లలకు చుక్కల మందు వేయనున్నారు. భద్రాద్రి జిల్లాలో మొత్తం 98,358 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించారు. వీరందరికీ పోలియోచుక్కలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జిల్లాలో మొత్తం 925 బూతులు, 92 రూట్లు, 38ట్రాన్సిట్ సెంటర్లు, 38మొబైల్ బృందాలను ఏర్పాటు చేశారు.

విస్తృత ప్రచారం కల్పించాలి

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం పల్స్‌పోలియోకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు ఖచ్చితంగా వేయించాలని అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు శనివారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష మాట్లాడుతూ పిల్లల నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు.

దా'రుణాలు' సైబర్ నేరగాళ్లవే..

7

- అమాయకుల నుంచి సేకరించిన కేవైసీ వివరాలు వారివద్దకే
- వాటితోనే పలు ప్రైవేటు బ్యాంకుల్లో ఖాతాలు
- పేదలకు రూ.10వేలు, ఏజెంట్లకు పెద్దఎత్తున కమీషన్లు



గొంతెండుతోంది..


కొత్తూరులో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు
- కొత్తూరులో నాలుగు గంటల పాటు నిరసన

అశ్వారావుపేట రూరల్, మార్చి 2: తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. మూడేళ్లుగా సమస్యను పరిష్కరించడం లేదని ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో రహదారిపై బైఠాయించారు. అశ్వారావుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం దాదాపు 100 మంది మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేశారు. వేలేరుపాడు మార్గంలో రోడ్డుపై టెంటు, తడికెలు, కంచె పెట్టి నాలుగు గంటల పాటు ఆందోళన చేయటంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది.

కొత్తూరు గ్రామంలో మూడు మోటార్లు ఉండగా రెండు పనిచేయటంలేదు. వాగులో ఏర్పాటు చేసిన మోటార్లు పూర్తిగా పనిచేయకపోవటంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నీటి ఎద్దటి మొదలైంది. దీంతో మహిళలు ఉదయం ఏడు గంటల నుంచి పదకొండు గంటల వరకు ఆందోళన చేశారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు గ్రామస్థులతో మాట్లాడారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి గ్రామానికి వెళ్లి మహిళలతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపడతామన్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో వచ్చేలా చూస్తామని తెలపటంతో మహిళలు ఆందోళనను విరమించారు.



ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఎవరిదో..

- ఆశావహుల్లో పెరుగుతున్న ఉత్కంఠ
- ఎంపిక బాధ్యత ఏఐసీసీదే
- రాహుల్ పోటీపై ఇంకా వెలువడని నిర్ణయం

7

విదేశీ విద్యకు సర్కారు ఆసరా



- బీసీ, మైనారిటి విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్యానిధి పథకం ఓ వరం
- మైనారిటీ విద్యార్థులకు ఈ నెల 20 వరకు అవకాశం
- బీసీ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 5 వరకు అవకాశం

6



గంజాయి కేసులో 13 మంది అరెస్ట్

- ముగ్గురు విక్రేతలు, పది మంది వినియోగదారులు...
- కేసు నమోదైనవారిలో ఒకరు మైనర్, ముగ్గురు విద్యార్థులు
- పోలీసు కమిషనర్ సునిల్‌దత్

6

విదేశీ విద్యకు సర్కారు ఆసరా

- బీసీ, మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్యానిధి పథకం ఓ వరం
- మైనార్టీ విద్యార్థులకు ఈ నెల 20, బీసీ విద్యార్థులకు ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులకు అవకాశం



ఖమ్మం ఖానాపురం హవేలి మార్చి 2: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నది. మహాత్మా జ్యోతిబాపూలే విద్యానిధి పథ కం ద్వారా బీసీ, ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నది. మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్యానిధి పథకం ద్వారా చదువుకునే మైనార్టీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. మైనార్టీ విద్యార్థులకు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. బీసీ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు. విద్యార్థుల అర్హత, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి విచారణ చేపట్టి డబ్బులు మంజూరు చేస్తారు.

రూ. 20 లక్షలు మంజూరు

విదేశీ విద్యానిధి పథకానికి ఎంపికైన బీసీ విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ రూ.20 లక్షలు అందించనున్నది. మైనార్టీ విద్యార్థులకు ఆ సంక్షేమ శాఖ ద్వారా రూ.20 లక్షలు అందించనున్నారు. వీసా వచ్చిన తర్వాత రూ. 10 లక్షలు, రెండో సంవత్సరం ఖర్చుల నిమిత్తం రూ.10 లక్షలు చెల్లించనున్నది. విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి వడ్డీ ధరల ప్రకారం అదనంగా రూ.10 లక్షల విద్యా రుణం తీసుకోవచ్చు. విమాన టికెట్‌కు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తుంది. యూఎస్‌ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగాపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాల్లో చదివేందుకు అవకాశముంది. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, స్వచ్ఛ సైన్స్, వ్యవసాయ సైన్స్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్స్ తదితర విభాగాలలో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో చేరే వారికి అవకాశం కల్పించారు.

కుటుంబంలో ఒకరికే అవకాశం

ఈ పథకం కింద కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఇస్తారు. ఎంపికైన అభ్యర్థి స్కాలర్‌షిప్‌తో పాటు ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి విద్యా రుణం పొందవచ్చు. చదువు కొనసాగిస్తూ తాత్కాలిక పరిశోధనలు, సహాయ బోధకులుగా పని చేసే అవకాశం కల్పిస్తారు. యూనివర్సిటీలో సీటు పొందిన ఏడాది లోగా చేరకుంటే పథకాన్ని రద్దు చేస్తారు. ఎట్టి పరిస్థితుల్లో సమయాన్ని పొడిగించరు. ఏ కోర్సు కోసం ఉపకార వేతనాన్ని పొందుతారో అందులోనే కొనసాగాల్సి ఉంటుంది. వీసాకు అయ్యే ఖర్చులు సైతం ప్రభుత్వమే చెల్లిస్తుంది. కోర్సు కాలం పూర్తయ్యే వరకు మాత్రమే వీసా అనుమతి ఉంటుంది. అనంతరం దేశానికి తిరిగి వచ్చేలా అంగీకరిస్తేనే ఉపకార వేతనం మంజూరవుతుంది. విద్యార్థులు బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గానికి చెందిన వారై ఉండాలి. వీరిలో బీసీ(ఏ)-29 శాతం, బీసీ(బీ)-42 శాతం, బీసీ(డీ)-29, మైనార్టీ వర్గాలకు నూరు శాతం రిజర్వేషన్ ఉంటుంది. ఇందులో మహిళలకు 33 శాతం, దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలి. డిగ్రీ, ఇంజనీరింగ్‌లో 60 శాతం మార్కులు తప్పకుండా ఉండాలి.

పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ మార్కుల జాబితా, జనన, ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఈ పాస్ ఐడీ నంబర్, పాస్‌పోర్టు, వీసా ఉండాలి. సంబంధిత యూనివర్సిటీ నుంచి అనుమతి పొందిన ఎఫ్1 కాపీ, ఐ-20 ఫాం, బ్యాంక్ పాస్ పుస్తకం, అభ్యర్థి ఫొటోలను జతచేయాలి. తెలంగాణ ఈ పాస్ వెబ్‌సైట్‌లో కింది ధ్రువ పత్రాలతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన వద్దిరాజు



కుటుంబ సమేతంగా మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి2: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సమేతంగా మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని నందినగర్‌లోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. రెండోసారి తనను పెద్దల సభకు ఎంపిక చేసినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీల గొంతుకగా నిలవాలని సూచించారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో వద్దిరాజు రవిచంద్ర సతీమణి విజయలక్ష్మి, కుమార్తె, అల్లుడు డాక్టర్ గంగుల గంగాభవాని, సందీప్, వద్దిరాజు అన్న కుమారుడు నాగరాజు, మనవళ్లు సనన్, గౌరవ్ తదితరులున్నారు.

అరుదైన వ్యాధులపై అవగాహన సదస్సు నేడు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి2: అరుదైన వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డీసీజెస్ అధ్యక్షుడు, సీఈవో ప్రొఫెసర్ ముత్యాల రామయ్య అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ (ఐఎంఏ)లో అరుదైన వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సును రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్, వైద్యాధికారులు, నిపుణులు సదస్సులో పాల్గొంటారని ఆయన తెలిపారు. సదస్సులో పాల్గొని, నిపుణులతో అరుదైన వ్యాధులపై ఆలోచనలు పంచుకోవడానికి, వనరులు, సహాయక సేవల గురించి తెలుసుకోవడానికి మంచి అవకాశం లభిస్తుందన్నారు. ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సత్తుపల్లిలో నిర్వహించనున్న ప్రజావాణి రద్దు: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి2: సత్తుపల్లిలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యారని తెలిపారు. దీంతో వచ్చే సోమవారం (మార్చి 4న) సత్తుపల్లి పట్టణంలో చేపట్టనున్న ప్రజావాణి కార్యక్రమంతో పాటు, ఖమ్మం కలెక్టరేట్‌లోనూ ఉండదని తెలిపారు. ప్రజలు గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శిశుగృహాలో ఐదు నెలల చిన్నారికి ఆశ్రయం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 2: నగరంలోని శిశుగృహంలో 5నెలల పాప సంరక్షణలో ఉందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. పాపకు జన్మనిచ్చిన తల్లితండ్రులు నేటి నుంచి 30 రోజుల్లోగా తగిన ఆధారాలతో సంబంధిత అధికారిని కలిసి సాక్ష్యాలను చూపిస్తే పాపను అప్పగిస్తామని తెలిపారు. లేని పక్షంలో పాపను అనాథగా ప్రకటించి, నిబంధనల ప్రకారం దత్తత ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 2: ఖమ్మం నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన పథకంతో అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులు ఈ నెల 15లోగా కళాశాలలో అందించాలని తెలిపారు. ఇంటర్, ఐటీఐ విద్యార్థులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పదో తరగతి పాస్ అయిన విద్యార్థులకు ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ మూడు నెలల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 2: జిల్లా వ్యాప్తంగా ద్వితీయ సంవత్సర ఆంగ్ల పరీక్ష పేపర్-2 శనివారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు తెలిపారు. మొత్తం 70 పరీక్షా కేంద్రాలలో జనరల్ విద్యార్థులు 14,687 మందికి 14,326 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 2,090 మందికి 2011 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 16,777 మందికి 16,337 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 440 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని పేర్కొన్నారు. కలెక్టర్ గౌతమ్ నగరంలోని న్యూ విజన్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారని తెలిపారు. కాగా ఖమ్మం రూరల్ మండలంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మాస్ కాపియింగ్ కేసు నమోదైనట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి పీజీ తరగతులు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 2: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ పీజీ మొదటి సంవత్సరం తరగతులు నేటి నుంచి ప్రారంభమవుతాయని ఆర్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ జాకిరుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులకు హజరయ్యే విద్యార్థులు యూనివర్శిటీ అందించిన పుస్తకాలు, ఐడి కార్డులను తీసుకోని రావాలని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో 13మంది అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీపీ సునీల్‌దత్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు, వినియోగంపై నిఘా పెట్టిన పోలీసులు ఓ కేసులో 23 మందిపై కేసు నమోదు చేసి, 13మందిని అరెస్ట్ చేశారు. ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ సునీల్‌దత్ ఈ మేరకు వివరాలను వెల్లడించారు. కొన్నిరోజులుగా నగరంలో జరుగుతున్న గంజాయి విక్రయాలపై సర్వే నిర్వహించి నిఘాపెట్టి అల్లీపురం రోడ్డులోని చెరుకూరి మామిడితోట సమీపంలో అనుమానస్పదంగా ఉన్న ముగ్గురు యువకులను తనిఖీ చేయగా వారి దగ్గర నాలుగు కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించామని తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లా రాజమండ్రి హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి తరపరెడ్డి మణికుమార్ అలియాస్ బన్ను, భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలానికి అనంతారం గ్రామానికి చెందిన పీజీ విద్యార్థి మాలోతు లోకేష్ నాయక్, ఖమ్మం నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన రాపిడో సర్వీసెస్‌లో పనిచేసే షేక్ అహ్మద్‌లు... ఏపీలోని వైజాగ్ రూరల్ ప్రాంతమైన నర్సీపట్నం నుంచి గంజాయిని తీసుకుని వచ్చి, నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు.

వారి నుంచి కొనుగోలు చేసి వినియోగిస్తున్న మరో 20 మందిపై కేసు నమోదు చేశామన్నారు. వారిలో 7మందిని అరెస్ట్ చేయగా.. మరో 13 మంది పరారీలో ఉన్నట్టు ఆయన తెలిపారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి, ఒక కారు, యాపిల్ ఐపాడ్, ఏడు మొబైల్ ఫోన్లు, 20 చిన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదైన గంజాయి వినియోగదారుల్లో ఒక మైనర్‌తోపాటు ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థులు దనియాకుల వెంకటేష్, కారుమంచి యశ్వంత్, షేక్ ఇర్ఫాన్‌లు, వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్న కోడి సాయి సుమంత్, ఇతర వృత్తుల్లో ఉన్న రుడావత్ రాకేష్, కోట మధు, సూరంశెట్టి భాస్కర్, మేకల నాగయ్య, పండి విజయ్, పల్లి విక్రమ్, పోతరాజు యోహన్, షేక్ ఇర్ఫాన్ అలియాస్ చోటు, చిర్రా నరేష్, వంగవీటి పవన్‌కల్యాణ్, ఉసికర్ల వెంకట సాయి, తోట నవీన్, షేక్ అన్వర్ పాషా, షేక్ కరీం, దాసరి యోహన్‌లు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్‌వీ రమణమూర్తి, సీఐలు ఆర్ భానుప్రకాష్, రమేష్, బాలకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

పాల్వంచలో ఎండు గంజాయి పట్టివేత

పాల్వంచ, మార్చి 2 : పాల్వంచలో టౌన్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చింతూరు నుంచి భద్రాచలం మీదుగా అక్రమంగా ఓ వాహనంలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెజీనా కాన్వెంట్ ఏరియాలో పాల్వంచ టౌన్ ఎస్‌ఐ బాణాల రాము నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆటోలో తనిఖీలు నిర్వహించగా అందులో 75ప్యాకెట్లలో 150 కిలోల ఎండు గంజాయి బయట పడటంతో నిందితులను ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించనున్నామని, పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.32 లక్షలు ఉంటుందని టౌన్ ఎస్‌ఐ తెలిపారు.

లొంగిపోయిన మావోయిస్టు దళసభ్యుడు

కొత్తగూడెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ఇల్లెందు-నర్సంపేట దళసభ్యుడు పూనెం అడమయ్య అలియాస్ గణేష్ శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సమక్షంలో లొంగిపోయాడు. భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలం అడవి రామవరం గ్రామానికి చెందిన పూనెం అడమయ్య గత కొంతకాలంగా మావోయిస్టు పార్టీ కొరియర్‌గా, నర్సంపేట ఏరియా కార్యదర్శి పాపన్న దళసభ్యుడిగా పని చేస్తున్నాడు. అయితే మావోయిస్టు పార్టీ విధానాలు నచ్చకపోవడంతో పోలీసులకు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తామని, ప్రభుత్వపరంగా వచ్చే సదుపాయాలన్నీ అందిస్తామన్నారు. అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసే మావోయిస్టులకు సాధారణ జీవితం గడిపేందుకు సహకరిస్తామని తెలిపారు. కాలం చెల్లిన మావోయిస్టు సిద్ధాంతాలకు యువత ఆకర్షితులు కావొద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్

రామయ్యను దర్శించుకున్న ఆడిట్‌శాఖ జాయింట్ డైరెక్టర్ ఇందిర

భద్రచలం, మార్చి 2: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని ఆడిట్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఇందిర శనివారం దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. దేవస్థానం వైదిక సిబ్బంది ఆమెకు వేద ఆశీర్వచనం అందజేశారు. అలాగే ఆమెతో పాటు కొత్తగూడెం జిల్లా ఆడిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ ఆడిటర్ మమతలు ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

వైరా, మార్చి 2: అనారోగ్య సమస్యలతో ఖమ్మం జిల్లా వైరా మునిసిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి గార్లపాటి ప్రవంత్(17)శనివారం వైరా రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రవంత్ స్థానిక ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం వార్షిక పరీక్షలు జరుగుతుండగా ఆ పరీక్షలకు సైతం హాజరవుతున్నాడు. అయితే అతడు కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా మనస్తాపం చెంది రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రవంత్ రాజర్వాయర్‌లో దూకిన విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లు, మత్స్యకారులతో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. శవపరీక్ష కోసం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కృష్ణసాగర్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

బూర్గంపాడు, మార్చి2: మండల పరిధిలోని కృష్ణసాగర్ బీట్ అధికారి శ్రీదేవి సస్పెన్షన్‌కు గురయ్యారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు ఈమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీట్ అధికారి సస్పెన్షన్ అంశం మండలంలో చర్చానీయంశంగా మారింది. గతంలో ఇరవెండి బీట్ అధికారిపై సస్పెన్షన్ వేటు పడగా, తాజాగా కృష్ణసాగర్ బీట్ అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది.

రూ.1.20లక్షల రాగి వైర్ చోరీ

పెనుబల్లి, మార్చి 2: పెనుబల్లిలోని రాతోని ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా చేసే రెండు ట్రాన్స్‌ఫార్మర్లను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసి రూ.1.20లక్షల విలువైన రాగి వైర్‌ను చోరీ చేశారు. ఈమేరకు శనివారం పెనుబల్లి సెక్షన్ ఏఈ బి.రవితేజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

మధిర రూరల్, మార్చి 2: మధిర మండలం దెందుకూరు రైల్వేగేట్ వద్ద గతనెల 27న గుర్తు తెలియని రైలు కింద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత, యువకుడు చికిత్స పొందుతూ వేర్వేరు ఆసుపత్రుల్లో శనివారం మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామానికి చెందిన వివాహిత గంతాల శ్రీలక్ష్మి(25) అదే గ్రామానికి చెందిన యువకుడు గంతాల సాయికృష్ణ(25) గత నెల 27న గుర్తు తెలియని రైలు కింద పడి దెందుకూరు రైల్వేగేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వివాహితను ఖమ్మం, యువకుడిని విజయవాడ ఆస్పత్రులకు తరలించారు. కాగా వివాహిత శుక్రవారం మృతి చెందగా, శనివారం యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

దుమ్ముగూడెం, మార్చి 2: పాముకాటుతో ఓ రైతు అస్వస్థతకు గురైన సంఘటన మండల పరిధిలోని రామారావుపేటలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు కొమరం రాంబాబు శనివారం తన పత్తిచేలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. గమనించిన తోటి రైతులు అతడిని చికిత్స నిమిత్తం 108ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేరు వేరు చోట్ల భవనం పై నుంచి పడి ఇద్దరి మృతి

ఖమ్మం క్రైం మార్చి 2: ఖమ్మం నగరంలో వేరు వేరు ప్రాంతాల్లో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి శనివారం ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాఫానగర్‌కు చెందిన కంది ప్రభాకర్(35) ఇందిరానగర్ లో ఓ పాత భవనం మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మెట్లుకూలి కిందపడి మృతి చెందాడు. అదే విధంగా బస్‌డిపో రోడ్డు ప్రాంతంలో నివసించే షేక్ ఖాదర్‌బాబా(47) ఆయన నివాసం ఉండే భవనంపై నుంచి శనివారం ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌టవర్ నిర్మాణం వద్దంటూ నిరసన



నిరసన తెలుపుతున్న స్థానికులు

వైరా, మార్చి 2: వైరా మునిసిపాలిటీ ఎనిమిదో వార్డు బంకు కాలనీలో జననివాస ప్రాంతంలో సెల్‌టవర్ నిర్మించొద్దని శనివారం కాలనీ వాసులు నిరసన తెలిపారు. నివాస గృహాల మధ్య సెల్‌టవర్ నిర్మించడం వల్ల వచ్చే రేడియేషన్ ప్రభావం కారణంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైన్స్‌కు వ్యాట్ షాక్

- 2017 నాటి సర్క్యులర్ అమల్లోకి తెచ్చిన సేల్స్‌ట్యాక్స్ శాఖ
- వైరా మద్యం స్టోర్స్ నుంచి ఖమ్మం వస్తున్న వాహనాల నిలుపుదల



వ్యాట్ అధికారులు నిలుపుదల చేసిన మద్యం రవాణా వాహనాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 2: మద్యం వ్యాపారులను వ్యాట్ (వ్యాల్యూ యాడెడ్ టాక్స్) పరిధిలోకి తీసుకువచ్చే సర్క్యులర్‌ను అమల్లోకి తెస్తూ సేల్స్ ట్యాక్స్ అధికారులు శుక్రవారం ఖమ్మం జిల్లాలో మద్యం రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారుల ఆకస్మిక నిర్ణయంతో అటు ఎక్సైజ్‌శాఖలో, ఇటు మద్యం వ్యాపారుల్లో గందరగోళం నెలకొంది. చివరకు వరంగల్ రీజియన్ సేల్స్ ట్యాక్స్ అధికారులతో ఖమ్మం ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, వైన్స్ అసోసియేషన్ నాయకులు చర్చలు జరపటంతో సమస్య కొలిక్కివచ్చింది. మద్యం వ్యాపారులు వ్యాట్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సేల్స్ ట్యాక్స్ అధికారులు సోమవారం వరకు గడువు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్లితే...

వాస్తవానికి మద్యం తయారీ సమయంలోనే మద్యం కంపెనీలు ప్రభుత్వానికి వ్యాట్ చెల్లిస్తాయి. ఆ తర్వాత డిస్టిలరీల నుంచి వైన్స్‌కు దశల వారీగా మద్యం సరఫరా జరుగుతుంది. ఎక్సైజ్‌శాఖ ఏర్పాటైన నాటి నుంచి ఇదే విధానం కొనసాగుతోంది. అయితే 2017లో మద్యం అమ్మకాలు జరిపే వ్యాపారులను కూడా వ్యాట్ పరిధిలోకి తీసుకురావాలని అప్పటి చీఫ్ సెక్రటరీ సోమేష్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. దీనిపై ఎక్సైజ్‌శాఖలో చర్చలు జరిపి రెండేళ్ల కాల పరిమితితో లైసెన్స్ పొందే వైన్స్ నిర్వాహకులు వ్యాట్ పరిధిలోకి రారని తెల్చారు. పర్మినెంట్ వ్యాపారులకే వర్తింపు జరుగుతుందని సర్క్యులర్ అమలును నిలుపదల చేశారు.

అయితే ఇదే సర్క్యులర్‌ను అమలు చేస్తూ సేల్స్ ట్యాక్స్ అధికారులు శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో వైరా మద్యం డిపో నుంచి తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం మద్యం షాపులకు మద్యం రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. వాటిని ఖమ్మంలోని పెవిలియన్ మైదానం వద్ద ఉంచారు. వ్యాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని, వ్యాట్ చెల్లించడం లేదనే కారణాలను ప్రస్తావించారు. దీనిపై ఖమ్మం బార్, వైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసి చర్చించారు. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు రాష్ట్ర స్థాయి ఎక్సైజ్‌శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి, వరంగల్ రిజీయన్ సేల్స్ ట్యాక్స్ అధికారి శ్రీనివాసరెడ్డితో చర్చలు నిర్వహించారు. చివరకు సేల్స్ ట్యాక్స్ అధికారులు వైన్స్ యజమానుల నుంచి వ్యక్తిగతంగా వినతిపత్రాలను తీసు కున్న తర్వాత మద్యం రవాణా వాహనాలను వదిలారు.

వైరా మద్యం డిపో నుంచి మద్యం రవాణా చేసే వాహనానికి ట్రాన్స్‌పోర్టు పర్మిట్ పత్రాన్ని తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. పోలీసు, సేల్స్ ట్యాక్స్, రవాణాశాఖలు మద్యం రవాణా వాహనాలను నిలుపుదల చేస్తే టీఆర్ పత్రాలను వాహనదారులు చూపించాల్సి ఉంటుంది. కాని తెల్లపేపర్ల కొరత ఉందంటూ గత రెండేళ్లుగా టీపీ పత్రాలు ఇవ్వకుండానే వైరా మద్యం డిపో నుంచి మద్యం రవాణా చేస్తున్నారు. ఈ విషయాన్ని కూడా సేల్స్ ట్యాక్స్ అధికారులు గుర్తించి వాహనాలను నిలుపుదల చేశారు.

మరోవైపు సేల్స్ ట్యాక్స్ అధికారుల తీరును నిరసిస్తూ ఖమ్మం బార్, వైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైరా మద్యం డిపో వద్ద సరుకును లోడ్ చేసుకోకుండా కొద్దిసేపు వాహనాలను నిలుపుదల చేశారు. ఖమ్మంలో అధికారులు అడ్డుకున్న వాహనాలను వదిలిన తర్వాతనే మద్యం తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి అసోసియేషన్ నాయకులతో మాట్లాడి శనివారం మధ్యాహ్నం నుంచి మద్యం రవాణా వాహనాల్లో లోడ్ చేయించారు.

ముగ్గురు మిర్చి దొంగల అరెస్టు

- ఆటోట్రాలీ, 32బస్తాల మిర్చి, రూ.95వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



దొంగిలించిన మిర్చి బస్తాలు, మిర్చి దొంగలతో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, మార్చి 2: రైతులు కల్లాలో ఆరబోసిన మిర్చిని అపహరించుకుపోయిన ముగ్గురిని టేకులపల్లి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను చోరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పది రోజుల క్రితం మండలంలోని తొమ్మిదవ మైలుతండా, కోయగూడెం, తావుర్యాతండాల్లో మిర్చిని కోసి కల్లాలలో ఆరబోయగా, తమ మిర్చి దొంగతనానికి గురైందని పలువురు రైతులు టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. శుక్రవారం రాత్రి టేకులపల్లిలోని తడికలపూడి క్రాస్‌రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, మిర్చిలోడుతో వెళ్తున్న ఆటో ట్రాలీ వాహనం అనుమానాస్పదంగా ఉండటంతో తనిఖీ చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని ఆటో ట్రాలీ వాహనం, 12మిర్చి బస్తాలతో పాటు, కోయగూడెం ఏరియాలో దొంగిలించిన 20బస్తాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిదవ మైలుతండాలో దొంగిలించిన 20మిర్చి బస్తాలను ఏన్కూరు మిర్చి మార్కెట్‌లో రూ.లక్ష20వేలకు అమ్ముకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.95వేల నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు భద్రాద్రికొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని గొల్లగూడేనికి చెందిన కోట రాంబాబు, మోకాళ్ల కృష్ణ, దేవనబోయిన శ్రీనివాస్‌గా గుర్తించామని తెలిపారు. వీరు వ్యసనాలకు అలవాటు పడి మిర్చి దొంగతనాలకు పాల్పడినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు. రైతులు కష్టపడి పండించుకొన్న పంటలను కాపాడుకోవడం కోసం కల్లాల వద్ద కాపలా ఏర్పరచుకోవాలని సూచించారు. మిర్చికి ధర అధికంగా ఉన్న నేపథ్యంలో మిర్చిని దోపిడి చేసే అవకాశాలు ఉన్నందున రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానస్పదంగా కొత్తవ్యక్తులు తారాసపడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, ఎస్‌ఐ ఎస్‌కే సైదా రావూఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



అమ్రు మృతదేహం

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 2: అప్పుల బాధ తాళలేక రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సేవ్యతండాలో శనివారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సేవ్యతండాకు చెందిన అంగోత్ అమ్రు(54) తనకున్న రెండెకరాల పొలంలో ఈ ఏడాది మిర్చి సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.2లక్షల వర కు అప్పులు చేశాడు. అయితే తెగుళ్ల బెడదతో దిగుబడి సరిగా రాలేదు. మరోవైపు తన కుమారుడు సురేష్ అనారోగ్యం భారిన పడడంతో చికిత్స కోసం మరో రూ.3లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే పంట సరిగా పండకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొంతకాలంగా మదనపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వైరా, మార్చి2: రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి చెందిన సంఘటన వైరాలోని పాతబస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా వ్యాపారి రాయల శ్రీనివాసరావు(58) చిరు వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ద్విచక్రవాహనంపై పాత బస్టాండ్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా తల్లాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడటంతో 108వాహనంలో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదే సమయంలో రోడ్డుపక్కనున్న సయ్యద్ పాషా, బాబాలకు కారు తగలడంతో గాయపడ్డారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4లక్షల విలువైన పేలుడు పదార్థాల పట్టివేత

ముదిగొండ, మార్చి 2: అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పండ్రేగుపల్లిలో ఓ స్టోన్ క్రషర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను శనివారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్య ఆదేశాల మేరకు సీఐ తిరుపతి, ముదిగొండ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచారనే సమాచారంపై దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో డిటోనేటర్ బాక్సులు, బూస్టర్ బాక్సులు, పవర్‌జల్ బాక్సులు, వైర్లను స్వాధీనం చేసుకొని ముదిగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నేలకొండపల్లి, మార్చి2: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను నేలకొండపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ముదిగొండ మండలం గంధసిరి నుంచి నేలకొండపల్లి మండలానికి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తోట నాగరాజు తెలిపారు. ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసును నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మావోయిస్టు మిలీషియా డిప్యూటీ కమాండర్ అరెస్టు

దుమ్ముగూడెం, మార్చి 2: పలు విధ్వంసాలు, నేరాలతో సంబంధం ఉన్న మావోయిస్టు మిలీషియా డిప్యూటీ కమాండర్ కారం వెంకటేష్ అలియాస్ వెంకాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం సివిల్, సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం అరెస్ట్ చేశాయి. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. దమ్మపేట మండలం పైడిగూడెం వద్ద శనివారం వాహన తనిఖీల చేస్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి సాకిలేరుకు చెందిన మావోయిస్టు మిలీషియా డిప్యూటీ కమాండర్ కారం వెంకటేష్ పట్టుబడ్డాడు. ఇతడు బాల్యం నుంచే నిషేధిత మావోయిస్టు పార్టీ బాలల సంఘంలో సభ్యుడిగానూ, 2017లో సాకిలేరు ఆర్‌పీసీ మిలీషియా సభ్యుడిగా, 2022నుంచి డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. సాకిలేరు వద్ద పోలీసులతో ఎదురుకాల్పుల సంఘటనతో పాటు పొటకపల్లి, దుబ్బమరక సీఆర్‌పీఎఫ్‌లపై దాడిచేసిన సంఘటనలతో పాటు పలు నేరాల్లో పాల్గొన్నాడు. వెంకటేష్‌ను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సంఘ విద్రోహశక్తులుగా మారిన మావోయిస్టు సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. పోలీసులకు లొంగిపోయి సాధారణ జీవితం గడపాలని సూచించారు. సమావేశంలో సీఆర్‌పీఎఫ్ 141 బీ ఎన్ సెకండ్ ఇన్ కమాండెంట్ ప్రీతా, సీఐ బి.అశోక్ సమావేశంలో పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్



మూడేసి ఉద్యోగాలు సాధించిన సాయిరాం, పుష్పలత, స్పందన, మేరీ

ప్రభుత్వ ఉద్యోగాలు.. వారి పాదాక్రాంతం..

- ఒక్కొక్కరికి మూడు, నాలుగు నౌకరీలు



నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన రమాదేవి, భవాని





స్పందన

బోనకల్/ఏన్కూరు/కరకగూడెం/ఇల్లెందు,/ఖమ్మం రూరల్ మార్చి 2: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఒక్కొక్కరికి మూడు, నాలుగు ప్రభుత్వ ఉద్యోగా లు వరించాయి. కరకగూడెం మండలం గొళ్లగూడెం మారుమూల గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి మలకం రమాదేవి జూనియర్ లెక్చరర్, టీజీటీ, ఇంగ్లీష్, మ్యాథ్స్ ఉద్యోగాలు సాధించింది. ఇల్లెందుకి చెందినవిరయోధుల భవాని పీజీటీ(బయోలజీ), టీజీటీలో సైన్స్, టీజీటీ బయోసైన్స్, జేఎల్(బోటనీ) విభాగంలో ఉద్యోగాలు సాధించింది.

బోనకల్ మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన చిలకా పుష్పలత మూడు కొలువులు సాధించింది. గురుకుల ఉద్యోగ పరీక్షా ఫలితాల్లో వరుసగా పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలకు ఎంపికైంది. గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన తమ్మారపు సాయిరాం పీజీటీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకుతో ఉద్యోగం వచ్చింది. మరో పరీక్షలో జేఎల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఒకే సారి రెండు ఉద్యోగాలు రావడంతో సాయిరాం జేఎల్ ఉద్యోగంలో చేరడానికి ప్రాధాన్యం ఇచ్చాడు.

ఏన్కూరు మండంలోని భగవాన్‌నాయక్‌తండాకు చెందిన బానోతు స్పందన ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. గురుకుల పీజీటీ, జూనియర్, డిగ్రీ లెక్చరర్ కొలువులు సాధించింది. ఏన్కూరుకు చెందిన బట్టు రూతుమేరీ పీజీటీ ఇంగ్లీష్, టీజీటీ బయోసైన్సు, టీజీటీ ఇంగ్లీష్ కొలువులకు ఎంపికైంది. శ్రీరామగిరి గ్రామానికి చెందిన మల్లెంపాటి సాంబశివరావు డిగ్రీ కాలేజీ లెక్చరర్స్ ఉద్యోగ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో కామర్స్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచి 32వ ర్యాంకు సాధించి ఉద్యోగం పొందాడు. ఏన్కూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కాంట్రాక్ట్ ఎస్‌వోగా పనిచేస్తున్న ఉషారాణి గురుకుల జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపికయింది.

ఖమ్మం రూరల్: మండల పరిదిలోని కొండాపురం గ్రామానికి చెందిన వేమూరి ప్రమీల మొదటి ప్రయత్నంలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గురుకుల ఉద్యోగ నియామకాల్లో టీజీటీ, పీజీటీతో పాటుగా జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. ప్రమీల తల్లిదండ్రులు భద్రమ్మ, వెంకటేశ్వర్లు గ్రామంలో కూలీలుగా పనిచేస్తు కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. ప్రమీలని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

కల్లూరు ఆర్డీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



ఆర్డీవో శ్రీనివాస్

కల్లూరు, మార్చి 2: కల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారిగా కే శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పరకాల నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు రాగా స్థానికంగా ఇప్పటి వరకు పని చేసిన ఆర్డీవో ఆశోక చక్రవర్తి నారాయణఖేడ్‌కు బదిలీ అయిన విషయం విదితమే. డివిజన్ కార్యాలయంలో బదిలీ ఐనా ఆర్డీవోను సన్మానిస్తూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలో గల సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, ఏన్కూరు మండలాల తహసీల్దార్లు యోగేశ్వరరావు, సాంబశివుడు, రవి, ప్రతాప్, ఎంఎ రాజు, శేషగిరిరావులతో పాటుగా పలవువురు అధికారులు, సిబ్బందిలు పాల్గొన్నారు.

నేటినుంచి రాజీవ్‌గాంధీ అంతరాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్

భద్రాచలం, మార్చి 2: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో పొదెం వీరయ్య యువసేన ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రాజీవ్‌గాంధీ మూడో అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంటు నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంటను భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య ప్రారంభించనున్నారు. ప్రథమస్థానం రూ.50 వేలు, ద్వితీయస్థానం రూ.25 వేలు, ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో ప్రతి మ్యాచ్ నిర్ణీత 10 ఓవర్లు మాత్రమే జరుగుతుందని నిర్వాహకులు పొలమూరి బసవరాజు, కాపుల శ్రీను, అలీం, మణి తెలిపారు.

ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఎవరిదో!

- ఆశావహుల్లో పెరుగుతున్న ఉత్కంఠ
- లోక్‌సభ అభ్యర్థి ఎంపిక బాధ్యత ఏఐసీసీదే
- రాహుల్ పోటీపై ఇంకా వెలువడని నిర్ణయం



ఖమ్మం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల టికెట్ పోరు కాంగ్రెస్‌లో రోజురోజుకు వేడెక్కుతుంది. ఖమ్మం లోక్‌సభ టికెట్ ఆశావహులు అధికంగా ఉండడంతో రాష్ట్రస్థాయిలో అభ్యర్థుల ఎంపిక కమిటీ తేల్చుకోలేక నిర్ణయం ఏఐసీసీకి వదిలేశారు. దీంతో టికెట్‌పై ఎవరికి వారే దీమాగా ఉన్నారు. ఖమ్మం లోక్‌సభ టికెట్‌కు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రస్థాయి లో పలువరు నేతలు దరఖాస్తు చేసుకున్న విషయం విదితమే. అయితే ఖమ్మం నుంచి కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పోటీచేస్తారని ఇటీవల ప్రచారం జోరుగా సాగుతుంది. అయితే రాహుల్ పోటీపై ఇంకా ఎటువంటి నిర్ణయం జరుగలేదు. మొదట్లో సోనియాగాంధీ నుంచి ఖమ్మం నుంచి అనుకోగా ఆమె రాజ్యసభకు రాజస్థాన్ నుంచి ఎన్నికయ్యారు.

ఇక ఖమ్మం లోక్‌సభ బరిలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి కూడా రాజ్యసభకు తెలంగాణ నుంచి ఎన్నిక కావడంతో ఆశావహుల్లో ప్రధాన పోటీ తప్పింది. అయితే ఇప్పుడు రాహుల్‌గాంధీ పేరు వినిపిస్తున్నా ఆయన నిర్ణయం తీసుకునే వరకు సస్పెన్స్ కొనసాగే పరస్థితి నెలకొంది. ఖమ్మం కాంగ్రెస్ టికెట్‌కు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని , మాజీ ఎంపీ వి.హనుమంతరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతోపాటు పలువురు దరఖాస్తు చేసి టికెట్ ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే ప్రసాదరెడ్డికి టికెట్ ఖాయమవుతుందని పొంగులేటి వర్గీయులు జిల్లాలో విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు ప్రసాదరెడ్డి కూడా పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇతర నియోజకవర్గాల్లో కూడా ఆయ న పర్యటనలు చేసేందుకు పొంగులేటి వర్గీయులు పర్యటన కార్యక్రమం రూపొందిస్తున్నారు. ప్రసాదరెడ్డి ఆత్మీయ పర్యటనలు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

కాగా మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ కూడా టికెట్ ప్రయత్నాలు వేగవంతం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ, డీకే శివకుమార్ తదితర ముఖ్యనేతలను కలిసి వచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని కూడా తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఖమ్మం కాంగ్రెస్ టికెట్ తెచ్చుకుంటే గెలుపు సులభంగా ఉంటుందని అందరూ భావిస్తున్నారు. దీంతో ఖమ్మం టికెట్‌కు భారీగానే డిమాండ్ కనిపిస్తుంది.

ప్రస్తుతం ఖమ్మం టికెట్ పోటీ తీవ్రంగా ఉండడంతో ఏఐసీసీ నిర్ణయం బట్టే అభ్యర్థి ఖరారు కానున్నారు. అయితే ఇటు ముగ్గురు నేతల నుంచి తమ కుటుంబసభ్యుల కోసం టికెట్ పోటీ ఉండడంతో రాహుల్‌గాంధీని ఎన్నికల బరిలో దించితేనే బాగుంటుందని అందరు కలిసి భారీ మెజారిటీతో రాహుల్ గెలుపునకు కృషి చేస్తామని కొందరు నేతలు అధిష్టానానికి లేఖలు పంపుతున్నారు. టికెట్ ఆశావహుల్లో కొందరు ఇదే విషయాన్ని అధిష్ఠానానికి సూచిస్తున్నారు. ఖమ్మం లోక్‌సభ నుంచి రాహుల్ బరిలో దిగుతారా లేక ప్రస్తుతం ఉన్న ఆశావహుల్లో ఎవరికైనా టికెట్ వరిస్తుందా అన్నది త్వరలో తేలనుంది.

'గృహజ్యోతి'పై అపోహలొద్దు

- అర్హులకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లే
- ఎస్ఈ సురేందర్



జీరో బిల్లు అందజేస్తున్న ఎస్ఈ సురేందర్

కొణిజర్ల, మార్చి 2: గృహజ్యోతి పథకం పై ప్రజలు అపోహలు పెట్టుకోవద్దని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబందించి జీరో బిల్లులను ఇస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ స్పష్టం చేశారు. కొణిజర్ల మండలం పాతకాచారం, పల్లిపాడు గ్రామాలలో శనివారం గృహజ్యోతి పథకం ఉచిత విద్యుత్ బిల్లుల పథకాన్ని ప్రారంభించారు. వినియోగదా రులకు జీరో బిల్లులను అందజేశారు. ఎస్ఈ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం జిల్లాలో పకడ్బందీగ అమలు జరుగుతుందని తెలిపారు. గృహజ్యోతి పథకం అర్హులందరికి అందుతుందని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఇంకా చేసుకోవచ్చని, నిరంతర ప్రక్రియ అని అన్నారు. 200 యూనిట్లులోపు విద్యుత్‌వాడుకొని జీరో బిల్లురాకపోయిన కూడ ఆందోళన చెందవద్దని, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబరు, కరెంట్‌బిల్లును సిబ్బందికి ఇవ్వవచ్చని, మండలపరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రజలంతా కూడ ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందేహాలు ఏమున్న తమ సిబ్బంది ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈతో పాటు పెద్దగోపతి ఏడీఈ తిలక్, ఏవో శ్రీధర్, ఏఈలు రాయల సురేష్, స్వాతి, సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ కొర్లపాటి సీతారామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లతో సింగరేణి జీఎం సమావేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సత్తుపల్లి, మార్చి 2: సత్తుపల్లిలోని కోల్ కాంట్రాక్టర్లు అందరితో సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు శనివారం సమావేశమయ్యారు. కాంట్రాక్టర్ల సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారా నికి సంబందిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. భ విష్యత్‌లో సమస్యలు రాకుండా సకాలంలో చర్యలు తీసు కోవాలని సూచించారు. వారికి సంబంధిం చిన బిల్లు లు ఎ వరైనా ఉద్దేశ్య పూర్వకంగా నిలిపివేసినా, జాప్యం చేసి నా, ఇతర రకాలుగా ఇబ్బంది పెట్టిన సమస్యను తన దృష్టికి తీసుకురావా లని జీఎం కోరారు. కాంట్రాక్టర్లను ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బంది పెట్టే అధికారులపై చర్యలు తీసుకొనేం దుకు వెనుకాడబోమని స్పష్టంచేశారు. బిల్లులు చెల్లించకుండా ఉద్దే శ్యపూర్వకంగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఒక కాంట్రాక్టు సంస్థ ప్ర తినిధి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సింగరేణి ఉన్నతాధికారులకు ఫిర్యా దు చేసిన విషయంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన విషయం విధితమే.

ఇందిరా డెయిరీ ఏర్పాటుపై సమావేశం

- మంత్రి సీతక్క ఆదేశాలతో కార్యచరణ తెలుసుకున్న ములుగు అధికారులు
- ప్రాజెక్టు గురించి వివరించిన ఐకేపీ అధికారులు



ములుగు అధికారులను సన్మానిస్తున్న ఐకేపీ సిబ్బంది

బోనకల్, మార్చి 2: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్, అడిషనల్ డీఆర్‌డీవో బాలస్వామి, డీపీఎంలు వేణుగోపాల్, సతీష్ శనివారం బోనకల్ ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క డ్రీమ్ ప్రాజెక్టు ఇందిరా డెయిరీ రూపకల్పన గురించి జిల్లా ఐకేపీ అధికారులతో సమావేశమయ్యారు. ములుగు జిల్లాలో మిని ఇందిరా డెయిరీ నిర్వహించుకునే కార్యక్రమంలో బాగంగా ఇక్కడ జరుగుతున్న పనులు, పథక లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో నూరుద్దీన్, డీపీఎం లక్ష్మణ్‌రావు పథకం గురించి వివరించారు. మధిర నియోజకవర్గం బోనకల్‌లో ప్రారంభించనున్న ఇందిరా డెయిరీలో 20వేల మంది మహిళలను వాటాదారులుగా చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ఒక్కొక్కరు రూ.2వేలు డిపాజిట్ చేసి వాటాదారులుగా చేర్చితే ప్రభుత్వం నుంచి వచ్చే వాటాధనంతో డెయిరీ కొనసాగుతుందన్నారు. పాడి పరిశ్రమతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాది, దాణా మిక్సింగ్ యంత్రాలు, గడ్డి కటింగ్, ప్రత్యేక రుణాలు ఇచ్చే అంశాల గురించి సమగ్రంగా వివరించారు. బోనకల్‌లో 9.24 ఎకరాల భూమి కేటాయింపుతో పాటు చేపట్టాల్సిన పనుల గురించి అవగాహన కల్పించారు. ఖమ్మం జిల్లా అధికారులు ఇందిరా డెయిరీ పై చేపడుతున్న కార్యచరణను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. అనంతరం వారిని ఐకేపీ అధికారులు సన్మానించారు.

నెరవేరిన రెండు దశాబ్దాల కల

- 23 మంది రైతులకు అందనున్న పట్టాదారు పాసు పుస్తకాలు
- ధరణి పెండింగ్ సమస్యకు పరిష్కారం

బోనకల్, మార్చి 2: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ రెండు దశబ్దాల రైతుల కలను నేరవేర్చింది. బోనకల్ మండలం లక్ష్మీపురం రెవెన్యూ పరిదిలో 379 సర్వే నంబర్‌లో 23 మంది రైతులు పది ఎకరాల ఇనాం భూములను సాగు చేసుకుంటున్నారు. పూర్వీకుల నుంచి వచ్చిన ఇనాం భూముల్లో సాగు చేసుకుంటున్నారే కాని యాజమాన్యపు హక్కులు రాలేదు. కొంత వివాదం నెలకొనడంతో ఆర్ఐ లక్ష్మణ్ రైతులను సమన్వయ పరిచి సమస్యను నాటి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి వోఆర్‌సీ ఇప్పించారు. పాసు పుస్తకా ల కోసం దరణీలో దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో బాగంగా శనివారం తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్, సిబ్బంది లక్ష్మీపురం గ్రామంలో రైతుల భూముల వద్దకు వెళ్లి విచారణ నిర్వహించారు. 23 మంది రైతులు ఇనాం భూముల్లో వాస్తవిక సాగుదారులుగా గుర్తించడంతో వారికి పాసు పుస్తకాలు జారీ చేసేందుకు మార్గం సుగమమైంది. రెవిన్యూ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

'జనజీవన స్రవంతిలో కలవండి'

గుండాల/ఆళ్లపల్లి/ కరకగూడెం, మార్చి 2: మావోయిస్టులారా.. మీ కుటుంబం ఎదురు చూస్తుంది.. మీ ఊరు రమ్మంటుంది.. కాలం చెల్లిన సిద్దాంతాలు వీడండి.. అమూల్యమైన జీవితాన్ని కాపాడుకోవాలంటూ పోలీసులు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని కోరుతూ.. శనివారం గుండాల, ఆళ్లపల్లి , కరకగూడెం మండలాల్లోని పలు గ్రామాల్లో పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సీఐ రవీందర్ మాట్లాడుతూ.. మావోయిస్టులు కుటుంబాన్ని వదిలిపెట్టి కాలం చెల్లిన సిద్ధాంతాలతో జీవితాలను ఆగం చే సుకోవద్దని అన్నారు. మావోయిస్టులు పోలీసుల వద్దకు వ స్తే ఎలాంటి హాని తలపెట్టకుండా తిరిగి తమ ఇళ్లకు వెళ్లొ చ్చన్నారు. మీ స్వేచ్ఛకు, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. ఇప్పుడిప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అందులో భాగస్వాములు కావల ని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం హామీ ఇస్తుందన్నారు.

జానకీసదనం ఉదంతంపై కమిషనర్‌కు నివేదిక!

భద్రాచలం, మార్చి 2: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలోని జానకీసదనం నిర్మాణ బాధ్యతను అప్పగిస్తామంటూ దేవస్థానంలోని ఏఈవో-1 వి.శ్రావణ్‌కుమార్ తమను మోసం చేశా రని ఆరోపిస్తూ హైదరాబాద్‌కు చెందిన ట్రస్టు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు క్రమంలో నివేదికను దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు దేవస్థానం అధికారులు పంపినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయంపై దేవస్థానం అధికారులను నివేదిక సత్వరమే అందజేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించిన క్రమంలో దేవస్థానం అధికారులు శుక్రవారం కలెక్టరుకు నివేదిక సమర్పించారు. ఇదే క్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్‌కు సైతం ఇందుకు సంబంధించిన నివేదికను పంపినట్లు తెలుస్తోంది. జానకీసదనం నిర్మాణ బాధ్యతలను చేపట్టేందుకు అనుమతులను ఇప్పిస్తామని పలు దఫాలుగా రూ.16 లక్షలు తమ వద్ద నుంచి తీసుకున్నారని ఈ క్రమంలో ఒక వ్యక్తిని కాంట్రాక్టర్‌గా తమకు పరిచయం చేశారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఏఈవో శ్రవణ్‌కుమార్‌కు ఈ విషయంలో వివరణ ఇవ్వాలని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మెమో జారీ చేశారు. ఇందుకు సంబంధించిన 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా జానకీసదనం విషయంలో దేవస్థానంలోని కొంత మంది ఉద్యోగులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక విచారణ నివేదికను కలెక్టర్‌కు, కమిషనర్‌కు దేవస్థానం అధికారులు పంపారు.

దా'రుణాలు' సైబర్ నేరగాళ్లవే..

- అమాయకుల నుంచి సేకరించిన కేవైసీ వివరాలు వారివద్దకే
- వాటితోనే పలు ప్రైవేటు బ్యాంకుల్లో ఖాతాలు
- పేదలకు రూ.10వేలు, ఏజెంట్లకు పెద్దఎత్తున కమీషన్లు
- హైదరాబాద్‌లో గుజరాత్ గ్యాంగ్ సైబర్ నేరం ఈ తరహాదే
- ఇల్లెందులో బాధితులనుంచి వివరాలు సేకరించిన సైబర్ పోలీసులు
- ఖమ్మం పాండురంగాపురంలోనూ పదుల సంఖ్యలో ఆధార్ లోన్లు

ఖమ్మం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డు, ఓ రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు ఉంటే చాలు.. రుణాలు ఇస్తామంటూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజలను మోసం చేస్తున్నది సైబర్ నేరగాళ్లే అని రూఢీ అవుతున్నది. స్థానికులను ఏజెంట్లుగా నియమించుకుని వారిద్వారా ప్రజల కేవైసీ వివరాలు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఫోటోలను సేకరించి ప్రైవేటు బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలను తెరుస్తున్నట్టుగా స్పష్టమవుతోంది. ఆధార్ లోన్ల పేరుతో రూ. 5 వేల నుంచి రూ.50 వేల వరకు ఇస్తున్న రుణాలన్నీ ఈ తరహాలోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం హైదరాబాద్ పోలీసులు పట్టుకున్న గుజరాత్ గ్యాంగ్ సైబర్‌నేరాలకు పాల్పడిన తీరు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

అక్కడి పోలీసులు పట్టుకున్న వారిలో ఓ వ్యక్తి షెల్ కంపెనీల పేర్లతో బ్యాంక్ ఖాతాలు తెరిచి, వాటిని సైబర్ నేరగాళ్లకు ఇచ్చేవాడు. మరో వ్యక్తి గుజరాత్‌లోని పేదల పేర్లతో ఖాతాలు తెరిచి, వివరాలు ఇచ్చిన వారికి రూ. 5వేల నుంచి రూ. 10వేలు ఇచ్చేవాడు. అలా సుమారు 70కి పైగా పేదల పేరుతో ఖాతాలు తెరిచినట్టు అక్కడి పోలీసులు గుర్తించారు. కాగా తాజాగా వెలుగులోకి వచ్చిన ఇల్లెందు ఘటన, ఖమ్మం నగరంలోని పాండురంగాపురంలో పదుల సంఖ్యలో ఆధార్‌కార్డుల పేర్లతో వివరాలు సేకరించే ఘటనలు సైతం ఈ తరహాలోనే జరుగుతున్నట్టుగా స్పష్టమవుతోంది.



ఇల్లెందు పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

కారణాలెన్నో..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరుగుతున్న ఈ వ్యవహారం సైబర్ నేరగాళ్ల వేసిన ఎరగా పరిగణించేందుకు బోలెడన్ని కారణాలున్నట్టు తెలుస్తోంది. ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురమ్మని అమాయక ప్రజలను బ్యాంకు లోన్లతో నమ్మబలుకుతున్న గ్రామదీపికలు, ఇతర ఏజెంట్లు వారిలో కొందరితో ఖాతాలు తెరిపిస్తుండగా, మరికొందరితో అసలు ఖాతాలు ఏమి లేకుండా పలు పత్రాలపై సంతకాలు తీసుకుని ఇంటికి పంపిచేస్తున్నారు. అంతేకాదు నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి చేతిద్వారా మాత్రమే నగదు అందజేస్తున్నారు.

ఇదిలా ఉంటే ఖాతాలు తెరిచిన వారి అకౌంట్లలో ఎక్కడినుంచో నగదు బదిలీ చేయిస్తున్నారు. వాటితోపాటుగా ఆయా అకౌంట్లలో నగదు పడగానే వెంటనే విత్‌డ్రా చేయించి కొంత నగదు ఆయా ఆధార్‌కార్డు ఇచ్చినవారి చేతిలో పెడుతున్నారు. దానికి కారణం సంబంధిత బ్యాంకు ఖాతాల్లో వేయించే నగదు కూడా సైబర్ నేరగాళ్ల ద్వారా వచ్చినవే అని స్పష్టమవుతోంది. ప్రస్తుతం ఇల్లెందుకు చెందిన ఐదుగురు మహిళల అకౌంట్లలో రూ. కోట్లలో జరిగిన లావాదేవీల్లోనూ ఇదే తరహాలో నగదు ఉపసంహరణలు జరిగాయి. ఎందుకంటే సైబర్ నేరగాళ్లు వేసిన వలను కనుక్కొని ఎవరైనా సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే ఆ ఖాతాలన్నీ ఫ్రీజ్ అయిపోతాయి. కాబట్టి ఇక్కడ లోను పేర్లతో వివరాలు సేకరించేవారు, అక్కడి కరెంట్ ఖాతాల్లో పడిన నగదును వెనువెంటనే ఉపసంహరించుకున్నట్టు తెలుస్తోంది.

అకౌంట్లను ఎలా వాడతారంటే..

ముందుగా స్థానికంగా ఉండే వ్యక్తుల ద్వారా ప్రజల ఆధార్‌కార్డులను, వివరాలను తీసుకుని వారికి రూ. 5 వేల నుంచి 20 వేల వరకు నగదు అప్పచెబుతారు. అనంతరం ఆ సమాచారంతో సైబర్ నేరగాళ్లు వాటి ద్వారా పలు ప్రైవేటు బ్యాంకుల్లో అసోసియేట్స్, ఎక్స్‌పోర్ట్స్, ఏజెన్సీస్ వంటి వాటి పేర్లతో పలు ట్రేడింగ్ కంపెనీల పేర్లమీద ఖాతాలను తెరుస్తారు. ఆ తర్వాత యూట్యూబ్ సబ్‌స్క్రిప్షన్, టాస్కులు, ఇతర అంశాల ద్వారా వారు విసిరే సైబర్ వలలో చిక్కిన వారిని మోసం చేసే క్రమంలో ఆయా కంపెనీల అకౌంట్ల పేర్లు, నెంబర్లు ఇచ్చి వాటిల్లో నగదును జమచేయాలని సూచిస్తారు. ఆయా అకౌంట్లలో నగదు జమచేయగానే వాటిని ఎక్కడో ఒకచోట నుంచి ఉపసంహరించుకుంటారు.



వివరాలు సేకరిస్తున్న కొత్తగూడెం సైబర్‌సెల్ పోలీసులు

ఇది ఇటీవల కాలంలో పేదల పేర్లతో ఖాతాలు తెరిచి సైబర్ మోసాలకు పాల్పడుతున్న తీరు. స్థానికంగా కూడా పలువురు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లోన్లపై అవగాహన ఉన్న యువతీ, యువకులను ఎంచుకుంటున్నట్టుగా తెలుస్తోంది. అంతేకాదు ప్రైవేటు లోన్లు ఇప్పించే కొందరు గ్రామదీపికలు కూడా ఇందులో ఉన్నట్టు తెలుస్తోంది. కాగా ఈ వ్యవహారం అంతా నేరుగా లోన్లు ఇప్పిస్తామని చెబుతున్నవారినుంచే సాగుతోందా? అకౌంట్లను స్థానికంగా తీసుకుంటున్నారా? ఆన్‌లైన్‌లో తీసుకుంటున్నారా? వంటి విషయాలను సైతం పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇది ఒక పెద్ద చైన్ లింకు కొనసాగుతోందనీ, ఆధార్ పేరుతో లోన్లు ఇప్పిస్తామని చెబుతున్న ఆయా వ్యక్తుల ఇళ్ల వద్దకు ఎవరో కొందరు వ్యక్తులు వచ్చి వెళ్తా ఉంటారనీ కొన్ని ప్రాంతాల్లోని స్థానికులు చెబుతుండటం గమనార్హం.

తాత్సారం చేస్తే తప్పదు మూల్యం..

ఇల్లెందులో జరిగిన ఘటనపై బాధిత మహిళలు అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ సంఘటన వెలుగులోకి వచ్చి పది రోజులు దాటినప్పటికీ విచారణలో జాప్యం కనిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం బ్యాంకు అధికారులను ఇల్లెందు పోలీస్ స్టేషన్‌కు పిలిచి వివరాలు సేకరించారు. బాధిత మహిళల నుంచి కొత్తగూడెం సైబర్ క్రైం పోలీసులు విచారణ నిర్వహించారు.

భద్రాద్రి కొత్తగూడెం
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఆదివారం 3 మార్చి 2024 | 8 | కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

సమస్యల పరిష్కారమే లక్ష్యం: జారే

దమ్మపేట, మార్చి 2: పేదల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మీ ఎమ్మెల్యే మీ ఇంటికి కార్యక్రమంలో బాగంగా శనివారం మండలంలోని పలుగ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేసారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలని నెరవేర్చుతుందని గృహలక్ష్మి, గృహజ్యోతి పదకాల ద్వారా ఉచిత కరెంట్, ఇంటింటి 500రూ.లకు గ్యాస్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించటం జరుగుతుందన్నారు. చిన్నగొల్లగూడెం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న బోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆలపాటి రాంచంద్రప్రసాదు, ఎంపీపీ సోయం ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, శ్రీరాముల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ భవనం

- శ్లాబ్ పెచ్చులు ఊడుతున్న వైనం
- భయాందోళనలో అధికారులు, ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- అధికారులు స్పందించాలంటున్న సందర్శకులు

కరకగూడెం, మార్చి 2: ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా నూతన ప్రభుత్వ భవనాలకు మోక్షం కలగడం లేదు. పాత భవనాలలో ప్రభుత్వ కార్యాలయలు ఏర్పాటు చేయడంతో భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు అందుబాటులో పాలన కొనసాగేందుకు నూతన జిల్లాలు, మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో బాగంగా కరకగూడెం మండలం 11-10-2016 సంవత్సంలో నూతనంగా ఏర్పడింది. నూతన మండలం కావడంతో ఉన్నత అధికారులు కరకగూడెం మండలంలో ఆయుర్వేదిక్ వైద్యశాలలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అప్పటినుంచి నూతన తహసీల్దార్ భవనాన్ని ఏర్పాటు చేయడం మారిచారు. తహసీల్దార్ భవనం శిథిలావస్థకు రావడంతో స్లాప్ పెచ్చులు ఊడి క్రింద పడుతున్నాయి. గతంలో పలువురిపై పెచ్చులు పడి స్వల్ప గాయాలు అయిన సంఘటనలు ఉన్నాయి. నిత్యం పాలన సాగిస్తున్న కార్యాలయంలో పెచ్చులు పడుతుండటంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, వివిధ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలోకి వస్తున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అంతే కాక వర్షాలు కురిస్తే భవనం నుంచి వర్షపు నీరు పడుతున్నాయని.. రికార్డులు కూడా తడుస్తున్నాయని అధికారులు వాపోతున్నారు. శ్లాబ్ పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో ప్రజలు, సంర్శకులు భీతిల్లుతున్నారు. ఈ సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్య వారికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నత అధికారులు, పాలకులు స్పందించి నూతన తహసీల్దార్ భవనం నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పెచ్చులూడిన దృశ్యం


వరండాలో ఇదీ పరిస్థితి


తహసీల్దార్ కార్యాలయ భవనం

గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


జీరో బిల్లుతో ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, మార్చి 2: మణుగూరు మండలంలోని కూనవరం పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గృహ జ్యోతి పధకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీరో విద్యుత్ బిల్లును జారీ చేశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడారు. పట్టణంలోని ప్రజాభవన్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపడుచుల వివాహ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన 25 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఐఎన్‌టీయుసీ యూనియన్‌కు చెందిన ఓబీ కార్మికులు శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసారు. ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ఓబీ కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడి కార్మికుల సమస్యలు, వేతన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మహనీయుడు శ్రీపాదరావు


నివాళులర్పిస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 2: దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు మహోన్నత వ్యక్తని, ఎస్సీ ఎస్టీ కులాల అభ్యున్నతికి పాటుపడి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించిన మహనీయుడని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు అన్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో మాజీ లోక్ సభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి ఉత్సవాలను అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాదరావు పేరు మీద గుర్తుగా ఉండాలని శ్రీపాద ప్రాజెక్టును నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, డీటీఆర్‌వోఎఫ్‌ఆర్ శ్రీనివాస్, ఆర్‌సీవో వెంకటేశ్వరరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఏటీడీవో నరసింహారావు, వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి పాల్గొన్నారు.

సమ్మె విరమించిన హాస్టల్ వర్కర్లు


ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 2: ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పని చేసున్న డైలీవేజ్ వర్కర్లకు 2022-23 కలెక్టరు కనీస వేతనాల సర్క్యులర్ ప్రకారం వేతనాలను పెంచి అమలు చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ పేర్కొన్నారు. భద్రాచలంలో గత నాలుగు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న డైలీవేజ్ వర్కర్లతో శనివారం ఆమె చర్చలు జరిపారు. ఈ సమయంలో కలెక్టరు ఇచ్చిన వేతన సవరణ ప్రకారం ఇకపై వేతనాలు చెల్లించడం జరుగుతుందని పేర్కొనడంతో పాటు వేతనాలకు సంబంధించిన బడ్జెట్ కూడా వారం రోజుల్లో తెప్పిస్తామని పేర్కొన్నారు. ప్రతి నెల మొదటి వారంలో జీతం వచ్చే విధంగా బడ్జెట్ ఇవ్వాలని ఉన్నతాధికారులకు లేఖ పెడతామని హామీ ఇచ్చారు. డీడీ హామీ మేరకు సమ్మెను విరమించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో నర్సింహారావు, సీఐటీయు నాయకులు బ్రహ్మచారి, నకిరికంటి నాగరాజు, హీరాలాల్, పాయం ముత్తయ్య, స్వామి కౌసల్య, రూపజ పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని మట్టి కరిపించేందుకే..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కొత్తగూడెం టౌన్, మార్చి 2: మతతత్వ బీజేపీని మట్టి కరిపించాలనే లక్ష్యంతో విప్లవ పార్టీలు ఐక్యత మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జిల్లా కార్యదర్శి కెచ్చర్ల రంగారెడ్డి తెలిపారు. ఈ నెల 3, 4, 5తేదీల్లో 18రాష్ట్రాల్లో పని చేస్తున్న మూడు విప్లవ పార్టీలు ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ప్రకటించారు. శనివారం ప్రజాపంథా కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ శక్తులను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పని చేస్తుందని ఆరోపించారు. దేశంలో దోపిడి వ్యవస్థ పెట్రేగిపోతుందని విమర్శించారు. కార్మికులు, కర్షకులను ఐక్యం చేసి విప్లవోద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఖమ్మంలో జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు.

న్యాయమూర్తులను కలిసిన కూనంనేని


న్యాయమూర్తులతో ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం కేంద్రంలో లేబర్ ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటు చేయాలని, అధికసంఖ్యలో కార్మికులు ఉన్నారని, వారి న్యాయపరమైన సమస్యల కోసం వరంగల్ వెళ్లాల్సి వస్తోందని, ఈ సమస్యను పరిగణలోకి తీసుకుని కొత్తగూడెం కేంద్రంగా లేబర్ ట్రిబ్యూనల్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు న్యాయమూర్తులను కోరారు. దమ్మపేటలో జూనియర్ సివిల్ జ్యుడిషియల్ కోర్టు ప్రారంభోత్సవానికి వెళ్తున్న క్రమంలో శనివారం సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఉన్న హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేష్, ఖాజా శరత్, ఇవి. వేణుగోపాల్‌లను ఎమ్మెల్యే కలిసి శాలువాలు, బొకేలతో సన్మానించి సమస్యను వివరించారు. తన ప్రతిపాదనపై న్యాయమూర్తులు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కూనంనేని తెలిపారు.

చిత్రకారుడికి అభినందనలు


రాజేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

చుంచుపల్లి, మార్చి 2: చిత్ర కారుడు, యువగజల్ కవి రాజేష్‌ను భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంకఅల శనివారం ప్రత్యేకంగా అభినందించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన ఈ చిత్ర కారుడు జిల్లా కలెక్టర్ ప్రియాంక అల చిత్రాన్ని గీసి కలెక్టర్‌కు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా ఆయనను అభినందించారు. అయన ప్రతిభను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి


సిబ్బందితో సెక్యూరిటీ అధికారులు

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 2: సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది వృత్తినైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సెక్యూరిటీ జనరల్ మేనేజరు బీఆర్. దీక్షితులు కోరారు. సింగరేణి ఆస్తులను కాపాడటంలో సిబ్బంది కీలకపాత్ర పోషించాలని కోరారు. శనివారం సెక్యూరిటీ సిబ్బంది ఫైర్‌ఫైటింగ్ శిక్షణ తరగతులు ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది ఫైర్‌ఫైటింగ్ శిక్షణలో నేర్చుకున్న అంశాలన్నింటిని విధుల్లో చూపించాలన్నారు. ప్రధానంగా ఇంటలిజెన్స్ వ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు ఆస్తుల పరిరక్షణకు శ్రమించాలన్నారు. సింగరేణి యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగపర్చుకుని సంస్థ అభివృద్ధికి శ్రమించాలని కోరారు. సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేయాలని కోరారు. నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సీనియర్ సెక్యూరిటీ అధికారి ఎండి. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు జీరో బిల్లుల అందజేత

సుజాతనగర్, మార్చి 2: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 ఉచిత విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం జీరో బిల్లులు అందజేశారు. ఫిబ్రవరి నెలలో విద్యుత్ వాడకానికి సంబంధించిన బిల్లులను సుజాతనగర్ పంచాయతీలో అందజేశారు. విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రీడింగ్ తీసి 200 యూనిట్ల లోపు బిల్లులు వచ్చిన వినియోగదారులకు జీరో అమౌంట్ బిల్లులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిషన్, సబ్ ఇంజనీర్ శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం గృహజ్యోతి పథకం: కోరం

టేకులపల్లి, మార్చి 2: నిరుపేద విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం ఒక వరమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కుంటల్ల గ్రామంలో శనివారం వినియోగ దారులకు జీరో బిల్లును అందచేసి గృహ జ్యోతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్ బిల్లులతో రేషన్‌కార్డు అనుసంధానమైన వినియోగదారులకు గృహజ్యోతి వర్తిస్తుందన్నారు. 200యూనిట్లలోపు విద్యుత్ వాడకం ఉన్న అందరికి ఈ నెల సున్నా బిల్లు రానుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలల్లో గృహ విద్యుత్ వాడకం దారులకు గృహజ్యోతి పథకం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీ ప్రభాకర్, ఏఈలు దేవా, బుజ్జి కన్నయ్య, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, పోషాలు, గణేష్, రెడ్యానాయక్, మధురెడ్డి, సంజయ్ పాల్గొన్నారు.


జీరో బిల్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

వేసవి సెలవులు ఇవ్వాలని ధర్నా

దుమ్ముగూడెం, మార్చి 2: మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ ములకపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీల సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఎండల తీవ్రతతో పసి పిల్లలు, బాలింతలు, గర్భిణీలు అంగన్వాడీ కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రాజెక్టు కార్యాలయ సిబ్బందికందజేశారు. నాయకులు కమలాదేవి, లలిత, గజలక్ష్మి, సుశీల, ఆదిలక్ష్మి, శిరీష, విజయ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరుటౌన్: మణుగూరు ఐసీడీఎస్ పరిధిలో నెలకొన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్ట్ సీడీపీవోకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కమిటీ సభ్యురాలు హేమలత, మణుగూరు ప్రాజెక్ట్ కన్వీనర్ శ్యామలరాణి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా ఒంటిపూట బడులను, ఎండాకాలం సెలవలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఉప్పతల నర్సింహారావు, సత్రపల్లి సాంబశిబరావు, సావిత్ర, సుగుణ, సురంజన, లక్ష్మీ, యశోద, సీతాలు, విజయలక్ష్మీ, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట: అంగన్‌వాడీ సెంటర్‌లకు మేనెలంతా సెలవులివ్వాలని అంగన్‌వాడీ వర్కర్లు అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగ సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నెల జీతం ఇవ్వాలని, సమ్మె కాలం వేతనాలు ఇవ్వాలని, పెండింగ్‌లోని గ్యాస్ బిల్లులు, ఈవెంట్ డబ్బులు ఇవ్వాలని, ఆరోగ్యలక్ష్మి బిల్లులు, కిచెన్ వాటిక డబ్బులు, ఐదు సంవత్సరాలుగ ఆగిపోయిన స్టేషనరీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. కేంద్రాలవద్ద మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, సమావేశాల సమయంలో టీఏ, డీఏలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెదనల్లబల్లిలో టీపీఈటీఎఫ్ సమావేశం

దుమ్ముగూడెం, మార్చి 2: పెదనల్లబల్లిలో శనివారం మండల తెలంగాణా ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. గుండెపోటుతో మృతిచెందిన సంఘం సభ్యుడు చింతల బాలరాజుకు తమ సంఘం నుంచి ఆర్థికసాయం అందించేందుకు ముందుకు రావాలని సంఘం అధ్యక్షుడు సూరిబాబు పిలుపునిచ్చారు.

ఎస్సీ సర్టిఫికెట్ల జారీపై ఫిర్యాదు

దుమ్ముగూడెం, మార్చి 2:తహసీల్దార్ కార్యాలయంలో బీసీ-సీ కులానికి చెందిన క్రిస్టియన్లకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని దళిత హిందూ మాలనాడు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జెట్టి వెంకట్రాజు శనివారం భద్రాచలం సబ్-కలక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలో జిల్లా కలక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, తహసీల్దార్ కార్యాలయం నుంచి అనర్హులకు ఎస్సీ సర్టిఫికెట్లను జారీ చేయడం ఆగలేదని ఆరోపించారు.

జీవో 3ని చట్టం చేయాలి

భద్రాచలం, మార్చి 2: జీవో నెం.3ని చట్టం చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు అన్నారు. భద్రాచలంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టికల్ 244(1) ప్రకారంగా ఐదో షెడ్యూల్ ప్రాంతంలో పేరా ఒకటి, రెండులను అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జీవోనెం.3ని ప్రత్యేక చట్టం తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర నాయకులు కొమరం నాగయ్య, కల్లూరి బొర్రయ్య, ఎన్.సత్యనారాయణ, సోయం కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయం పరామర్శ

పినపాక, మార్చి 2: పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు శనివారం మండలంలో పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా అమరారం పంచాయతీలోని కొత్తూరు కాలనీకి చెందిన గొగ్గల సూర్యకాంతం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయమందించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కిష్టాపురం గ్రామానికి చెందిన పాయం ప్రసాద్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి ఆరా తీశారు. ప్రసాద్ ఆరోగ్య ఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సాయమందించారు. అనంతరం సామర్లకోట గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలు ఎమ్మెల్యే పాయంకు అందించారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

పాల్వంచ రూరల్, మార్చి 2: పదో తరగతి అంతిమ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లావిద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి ఆదేశించారు. పాల్వంచ మండలంలోని జగన్నాధపురం ఉన్నత పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా వెనుకబడిన విద్యార్థులకు పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేస్తున్న బోధన ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు దాతలు అందచేసిన పెన్నులను ఆయన అందచేసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా పేదరికం నుంచి వచ్చిన వారేనని దీన్ని దృష్టిలో పెట్టుకుని చదివే తమ అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని కోరారు. ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్, సెక్టోరల్ అధికారి ఎస్‌కే. సైదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం

అశ్వాపురం, మార్చి 2: అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఇరవెండి సెక్షన్ నెల్లిపాక బ్లాక్, తుమ్మలచెరువు బీట్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ 206లో శనివారం ఇంకుడు గుంతల నిర్మాణాలకు ఫారెస్ట్ అధికారులు శ్రీకారం చుట్టారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో భూగర్భ జలాల పెంపుతో పాటు వేసవిలో వన్యమృగాలకు నీరు అందించాలన్న లక్ష్యంతో ఉపాధి హామీ పథకం ద్వారా ఎస్.సి.టి పనులను ప్రారంభించారు. ఈపనుల్లో భాగంగా సుమారు వంద మంది కూలీలు ఉపాధి పొందనున్నారు. కార్యక్రమంలో ఇరవెండి సెక్షన్ అధికారి శంకర్, తుమ్మలచెరువు బీట్ అధికారి రమేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

జూలూరుపాడు, మార్చి 2: 0-5 సంవత్సరాల లోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయించి ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ వైద్యురాలు తేజస్వీని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించే దానిలో భాగంగా శనివారం జూలూరుపాడులో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వడ్లముడి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్ వైజర్లు రత్నకుమార్, సుభద్ర, రాధిక పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: 0 - 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు వేసే పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు మంగపేట ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంపై ములకలపల్లి ప్రధాన సెంటరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు.

భద్రాచలంలో..

భద్రాచలం: భద్రాచలంలో శనివారం జిల్లా ఉప వైద్యాధికారి ఆదేశాల మేరకు డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో వైద్య శాఖ సిబ్బంది పల్స్‌పోలియో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే పల్స్‌పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల్లోపు పిల్లలందరికి తల్లిదండ్రులు పల్స్‌పోలియో టీకాలు వేయించుకునే విధంగా వైద్య సిబ్బంది , ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థల సభ్యులందరూ సహకరించాలని కోరారు. భద్రాచలంలో 37 బూత్‌లు, నాలుగు రూట్‌లు, మూడు ట్రాన్సిట్ పాయింట్స్, బస్టాండు, బ్రిడ్జి పాయింట్‌లలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి పల్స్‌పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్‌ఎంలు ఆశాలు కాంతమ్మ, సీహెచ్‌వో కృష్ణయ్య, హెచ్ఈవో శారద, హెచ్ఈ సద్గుణ వాణి పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందాం

పాల్వంచ రూరల్, మార్చి 2: అత్యంత వేగవంతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం పాల్వంచ మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాలైన చంద్రాలగూడెం, రేకులగూడెం, మల్లారం, ఉల్వనూరు, యానంబైలు, ప్రభాతినగర్, ఇల్లందుపాడుతండా, సూరారం, సోమ్లాగూడెంలో కోటీ 45లక్షల రూపాయల ఎన్ఆర్‌ఈఎస్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనతికాలంలోనే పల్లెపల్లెకు రహదారుల సౌకర్యం కల్పించేందుకు ప్రణాళిక రచించామన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ఏజెన్సీ ప్రజల సకల సౌకర్యాలు కల్పించేంత వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జడ్పీటీసీ బరపాటి వాసు, తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ రాజ్ డీఈ, సీడీపీవో, రూరల్ ఎస్ఐ, సీపీఐ నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, విద్యుత్‌శాఖాధికారులు, ఫారెస్ట్‌శాఖాధికారులు, గ్రామపంచాయతీలో స్పెషల్ ఆఫీసర్లు, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో మహిళలకు క్రీడలు

మణుగూరురూరల్, మార్చి 2: ఈ నెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శనివారం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మహిళలకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను బీటీపీఎస్ సీఈ బిచ్చన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఈ పార్వతి, శ్రీనివాసారావు, రమేష్‌బాబు, సూర్యనారయణ, రమణమూర్తి, డీవై సీసీఏ శ్రీనివాసరావు, స్పోర్ట్స్ సెక్రటరీ కత్తి నరసింహారావు, ఎస్‌వీ సత్యనారాయణ, భీమ్యా, సుగునాకర్‌రావు, సాయిప్రసాద్, గోపి, అనిల్, నాగేశ్వరరావు, లక్ష్మీప్రియ, రజనీ తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుపై ఆసక్తి కనబర్చాలి

కరకగూడెం, మార్చి 2: యువత చదువుపై ఆసక్తి కనబర్చాలని కరకగూడెం తహసీల్థార్ నాగ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కరకగూడెం జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూర్భాగాంధీ పాఠశాలలో అఖండ స్వచ్ఛద సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, స్కేల్లు, పెన్నులను తహస్దీల్థార్ నాగ ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వండిన వంటకాలను పరిశీలించిన తహసీల్థార్ విద్యార్థులకు మంచిగా ఉండేలా వండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఖండ సంస్థ సభ్యులు నరేష్, కమలాకర్, చందా మధు, ఆర్ఐ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.